సాక్షి కర్నూలు

శనివారం । 7 । డిసెంబర్ । 2024



చౌక డిపోలపై నిఘా

చౌకడిపో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు కుమ్మక్కై రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు రేషన్ మోసాలపై నిఘా పెట్టారు. 10లో▸



భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబాదేవి మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. సేవా సంకల్పం పఠించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,629.51
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 92.132
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 4,141
అవుట్ ఫ్లో	: 5,204

న్యూస్‌రీల్

విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



సదస్సులో మాట్లాడుతున్న లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామచంద్రారావు

కర్నూలు(అర్బన్): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విశ్వకర్మ పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎస్ఆర్ రామచంద్రారావు కోరారు. శుక్రవారం బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవపూజ ధనుంజయ ఆచారి అధ్యక్షతన స్థానిక బీసీ భవన్‌లో విశ్వకర్మ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిశ్రమల శాఖ ఐపీఓ హరి, కర్నూలు పట్టణ ప్రాజెక్టు అధికారిణి పీఓ వెంకటలక్ష్మి, మెప్మా అధికారి భాస్కర్‌రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మురళీనాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామచంద్రారావు మాట్లాడుతూ విశ్వకర్మ పథకంతో దాదాపు 18 రకాల సంప్రదాయ వృత్తులను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కులాల్లోని ప్రతి ఒక్కరు ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఐపీఓ హరి, బీసీ నాయకులు శ్రీరాములుయాదవ్, బెస్త ఈరన్న, అయ్యన్న యాదవ్, బ్రహ్మయ్య ఆచారి, సత్యనారాయణ ఆచారి, చంద్రికమ్మ పాల్గొన్నారు.

రేపు ఎన్‌ఎంఎంఎస్ టెస్ట్

కర్నూలు(సెంట్రల్): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్టు–2025ను ఈనెల 8వ తేదీ జరగనున్నట్లు డీఈఓ శామ్యూల్‌పాల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు జిల్లాలో మొత్తం 3,865 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, మొత్తం 18 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణ కోసం 18 మంది సూపరింటెండెంట్లు, 18 మంది డిపార్టుమెంటల్ అధికారులు, ఇద్దరు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు, ఇన్విజిలేటర్లను నియమించినట్లు చెప్పారు.

తిరుమల తరహాలో శ్రీశైలం అభివృద్ధి

మహానంది: దేశంలో మహిమాన్వితమైన క్షేత్రాల్లో ఒకటైన శ్రీశైలాన్ని టీటీడీ తరహాలో అభివృద్ధికి కృషి చేస్తానని శ్రీశైలం నూతన ఈఓ ఎం.శ్రీనివాసరావు అన్నారు. నంద్యాలలో కలెక్టర్ రాజకుమారి, జేసీ విష్ణుచరణ్, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాలను కలిసేందుకు వచ్చిన ఆయన శుక్రవారం సాయంత్రం మహానందికి వచ్చారు. ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు ఆయనకు స్వాగతం పలకగా మహానందీశ్వరుడిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఈఓ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ తిరుమల తరహాలో శ్రీశైలం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామన్నారు. భక్తుల మనోభావాలు ఏ మాత్రం దెబ్బతినకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అర్చకులు అర్జున శర్మ, వనిపెంట జనార్దనశర్మ, పండితులు ఈఓ శ్రీనివాసరావుకు మహానందీశ్వరుడి ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు.

ఎరగా చేపపిల్లలు

- కృష్ణా తీరంలో ఫిష్ మాఫియా ఆగడాలు
- మైనర్లతో నదిలో ప్రమాదకర చేపల వేట
- ఉద్యోగాల పేరుతో ఇతర ప్రాంతాల నుంచి తీసుకొస్తున్న ముఠాలు
- బందీలుగా మార్చి వెట్టిచాకిరీ
- చోద్యం చూస్తున్న మత్స్యశాఖ అధికారులు



సంగమేశ్వరం సమీపాన కృష్ణా నదిలో మత్స్యకారుల చేపల వేట

కృష్ణానదీ తీరం వెంట ఫిష్ మాఫియా రెచ్చిపోతుంది. అడ్డదారిలో విలువైన మత్స్య సంపదను రాష్ట్రాలు దాటిస్తూ సొమ్ము చేసుకుంటోంది. నిబంధనలకు విరుద్ధంగా చేపల వేటకు మైనర్లను నదిలోకి దింపుతోంది. ఉద్యోగాల పేరుతో విద్యార్థులు, యువకులకు గాలం వేసి బందీలను చేసి వేట కొనసాగిస్తోంది. దళారులను ఏర్పాటు చేసుకుని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి అడ్వాన్స్ ఎర వేస్తోంది. కృష్ణా ప్రవాహం వెంబడి ఫిష్ మాఫియా చీకటి సామ్రాజ్యాన్ని విస్తరించుకుని మైనర్లతో వెట్టిచాకిరీ చేయి స్తున్నా అడిగేవారు కరువయ్యారు.

కొత్తపల్లి/శ్రీశైలం ప్రాజెక్ట్: పేద, గిరిజన, మత్స్యకారుల కుటుంబాలకు జీవనాధారం.. కృష్ణా తీరం. పర్యాటక ప్రాంతాలు, చారిత్రాత్మక క్షేత్రాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి తీరం ఇప్పుడు ఫిష్ మాఫియాకు అడ్డాగా మారింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో శ్రీశైలం జలాశయం ఎగువ, దిగువ ప్రాంతాల్లో ఏటా దాదాపు రూ. 50 కోట్ల చేపల బిజినెస్ జరుగుతుంది. కొత్తపల్లి మండలం కపిలేశ్వరం, సంగమేశ్వరం ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయం వరకు మత్స్యకారులు కృష్ణానది తీరం వెంట స్థావరాలు ఏర్పాటు చేసుకుని నదిలో చేపలవేట కొనసాగిస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే మత్స్యకార జీవితానికి కొంత మంది దళారులు అడ్డంకులు సృష్టిస్తున్నారు. మత్స్యశాఖ జారీ చేసిన లైసెన్స్‌లు ఉన్నవారే చేపల వేట చేపట్టాలి. నిబంధనలను గంగలో కలిపి పెద్దపెద్ద దళారీలు మాఫియాగా మారి మత్స్య సంపదను దోచుకుంటున్నారు. దూర ప్రాంతాల నుంచి మైనర్లను కూలీకి తీసుకువచ్చి బలవంతంగా చేపల వేట చేయిస్తున్నారు. ఈ ముఠాలు గుంటూరు, వైజాగ్, విజయవాడ, ఇతర ప్రాంతాల్లోని దళారీలను ఏర్పాటు చేసుకుని ఉద్యోగాల పేరుతో నమ్మించి రాత్రికి రాత్రి జన సంచారం లేని అటవీ ప్రాంతంలోని కృష్ణా తీరానికి తరలిస్తున్నారు. చేపల వేట రాని యువకులు తాము ఈ పని చేయలేము.. అని ఎదిరిస్తే వారిని చితకబాది, ఫోన్లు తీసుకొని బందీలుగా మార్చి వారితో వెట్టి చాకిరీ చేయిస్తున్నారు. ముఠా నాయకుల మాట వినకపోతే కృష్ణానదిలో ప్రాణాలు నీటిలో కలిసిపోవాల్సిందే. ఇందుకు నదిలో గుర్తు తెలియని శవాలే నిదర్శనమని కొందరు చర్చించుకుంటున్నారు. ఇటీవల ఈ ముఠా ఉచ్చులో గుంటూరు, నరసరావుపేట నుంచి మొహిద్దీన్ అనే వ్యక్తి ఆరుగురుని చేపల ఆక్వేరియంలో ఉద్యోగాల్పిస్తామని, నెలకు రూ.15వేలు జీతమని నమ్మించి సంగమేశ్వరం సమీపంలోని చీమలతిప్ప ప్రాంతానికి తరలించారు. అందులో గుంటూరుకు చెందిన ఆరీఫ్, ఇంకో వ్యక్తి తప్పించుకుని గుంటూరుకు చేరుకోవడంతో మాఫియా ఆగడాలు మళ్లీ వెలుగులోకి వచ్చాయి.

తీరం వెంబడి చేపలను ఎండబెడుతున్న కూలీల్లో మైనర్లు



అరకొర తిండి.. గుడారాలే నీడ

ఉద్యోగాల పేరుతో చేపల వేటకు తీసుకొచ్చిన పిల్లలను ఫిష్ మాఫియా హింసించి పనులు చేయించుకుంటోంది. శ్రీశైలం జలాశయం ఎగువ భాగంలో నీరిగంగ, గజ్జలకొండ, ఆవులమంద, గువ్వలకుంట్ల, గుమ్మడాపురం, ముసలిమడుగు, ఎర్రమఠం, కపిలేశ్వరం, కొక్కెరంచ, కపిలేశ్వరం, పాతమాడుగుల, సంగమేశ్వరం, కొత్తపల్లి ప్రాంతాల్లో, జలాశయానికి దిగువ భాగంలో లింగాలగట్టు, వజ్రాలమడుగు, వియర్‌డ్యాం, నల్లవాగు, జెండాపెంట, బొమ్మర్ల, కయ్య, ఏడొంపులు, నాగార్జునసాగర్ వరకు వేట కొనసాగుతుంది. చేపల వేటకు వచ్చిన కార్మికులకు నదీ తీరం వెంట అక్కడక్కడా గుడారాలు వేసి, వారికి అరకొరగా నిత్యావసర వస్తువులు ఇచ్చి బలవంతంగా పనులు చేయించుకుంటోంది. వలలో చిక్కుకుని, తెప్పలు తిరిగిపడ్డప్పుడు ప్రమాదవశాత్తూ మరణించినా వారికి దిక్కు లేదు. కొన్నేళ్ల క్రితం అప్పటి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలరెడ్డి చేపలవేటలో ఉన్న దూరప్రాంతాలకు చెందిన 40 మంది మైనర్లను విడిపించి రక్షించారు. తాజాగా గుంటూరు జిల్లాకు చెందిన ఆరిఫ్ ఉదంతంతో మళ్లీ ఫిష్ మాఫియా ఆగడాలు తెరపైకి వచ్చాయి. ఇన్నేళ్లుగా ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నా మత్స్యశాఖ అధికారులు తమకేం తెలియదని చేతులు దులుపేసుకుంటున్నారు.

అలవి వలలతో తరిగిపోతున్న మత్స్య సంపద

అలవి వల ఒక్కొక్కటి 80 నుంచి 100 మీటర్ల పొడువు ఉంటుంది. వీటితో అతి చిన్న చేపపిల్ల మొదలుకొని పెద్దపెద్ద చేపలు పట్టవచ్చు. ఒక్కొక్క వలలో ఒక్కసారి వేట చేస్తే 60 కేజీల నుంచి 100 కేజీల వరకు చేపలు పడతాయి. అయితే వీటితో దళారులు మత్స్యకారులతో రోజుకు ఒక్కసారితోనే కాకుండా రెండు, మూడుసార్లు వేట చేయిస్తున్నారు. ఈ వలలకు క్షీరమేను, నట్టింక, దొమ్మ, దొందు, రొయ్య, జల్ల వంటి రకాల చేపలు పడుతాయి. వీటికి చాలా గిరాకీ ఉంటుంది. వీటిని ఎండబెట్టి కేజీ రూ.100 నుంచి రూ.300 వరకు అమ్ముకుంటున్నారు. ఈ వలలతో వేటను రాత్రిపూట ఎక్కువగా సాగిస్తున్నారు తీరం వెంట దళారులను పెట్టి ఫిష్‌మాఫియా చేప సంపదను కొల్లగొడుతోంది. కూలీలకు రోజుకు ఒక వ్యక్తికి రూ.300 నుంచి రూ.700 దాక ఇచ్చి దళారులు మాత్రం లక్షలు ఆర్జిస్తున్నారు.

నది పరిధిపై పెత్తనం

శ్రీశైలం జలాశయం ఎగువ, దిగువ నదీ ప్రవాహ పరిధిపై ధన బలం ఉన్నోడిదే పైచేయి. తీరంలో ఒక్కొక్కరు తమ పరిధి ఇంత వరకు నీ పరిధి ఇంత వరకు అని పంచుకుంటారు. పంచుకున్న ప్రాంతంలో చేపలు పట్టుకోవడం, లేదా కూలీల ద్వారా వేట కొనసాగించడం, లీజుకు ఇచ్చుకోవడం, అవసర పరిస్థితుల్లో అమ్ముకోవడం కూడా జరుగుతుంది. శ్రీశైలం మండలంలోని లింగాలగట్టులోనే ప్రభుత్వ అనుమతులు లేని బడా షెట్లకు చెందిన 13 చేపల కంపెనీలు ఉన్నాయి. సంగమేశ్వరం నుంచి శ్రీశైలం జలాశయం వైపు దుర్గం వరకు సుమారు 50 కి.మీల మేర కృష్ణాతీరం కొత్తపల్లి మండల పరిధిలోకి వస్తుంది. ఈ తీరం వెంట సుమారు 1,050 మంది మత్స్యకారులు చేపల వేట సాగిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరంతా అధికారుల నుంచి లైసెన్స్‌లు పొంది వేట సాగిస్తున్నారు. అయితే అనధికారికంగా మరో 600 మంది కృష్ణా నది తీరం వెంట జీవనం సాగిస్తున్నారు. అయితే వీరి మాటున ఫిష్ మాఫియా రెచ్చిపోతుంది.

నంద్యాలలో బేబమ్మ

సినీ హీరోయిన్ కృతిశెట్టి నంద్యాలలో సందడి చేశారు. శుక్రవారం నంద్యాల పట్టణంలో జరిగిన సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. విషయం తెలుసుకున్న అభిమానులు పెద్ద ఎత్తున షాపింగ్ మాల్ వద్దకు చేరుకున్నారు. బేబమ్మా.. అంటూ యువత హోరెత్తారు. అభిమానులకు కృతిశెట్టి అభివాదం చేస్తూ పాటలకు డ్యాన్స్ వేసి అలరించారు.

– నంద్యాల



నేడే మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్

- జిల్లాలోని 1457 పాఠశాలల్లో నిర్వహణకు ఏర్పాట్లు
- పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులకు ఆహ్వానం

కర్నూలు(సెంట్రల్): పాఠశాలల అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం పెంచేందుకు శనివారం మెగా పేరెంట్స్–టీచర్స్ మీట్ నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 1,457 పాఠశాలల్లో పేరెంట్స్–టీచర్స్ మీట్‌లు జరుగుతాయి. ఆయ మీట్‌లకు స్థానిక ప్రజాప్రతినిధులతోపాటు పూర్వ విద్యార్థులను ఆహ్వానించారు. ఈమేరకు పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లను పూర్తి చేసింది.

ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహణ

అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, బోధనాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ నిర్వహిస్తున్నారు. ఆహ్లాదకర వాతావరణంలో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రతి ప్రభుత్వపాఠశాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులకు ఆహ్వానాలు పంపారు. వీరు పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థుల వికాసం, అకాడమిక్ సామార్థ్యాల పెంపు, తరగతి గదుల విస్తరణ, సామాజిక పలకరింపు, తరగతి గదిలో విద్యార్థుల ప్రవర్తనపై చర్చిస్తారు. అంతేకాక విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు, హెల్త్ రిపోర్టులను అందజేస్తారు. చివరగా మధ్యాహ్నం సహపంక్తి భోజనం చేస్తారు. కాగా మెగా పేరెంట్స్–టీచర్స్ మీట్ విజయవంతం కోసం 13 కమిటీలను ఏర్పాటు చేశామని డీఈఓ శ్యాముల్‌పాల్ తెలిపారు.

బాబాసాహెబ్ గొప్ప దార్శనికుడు



అంబేడ్కర్‌కు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీమోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు

- భారత రాజ్యాంగం ద్వారా దేశం దశ దిశ మార్చిన మహనీయుడు
- అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి వెల్లడి
- ఏపీలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని ధ్వజం

కర్నూలు (టౌన్): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గొప్ప దార్శనికుడు అని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లోని సమావేశ హాలులో బాబా సాహెబ్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్వీమోహన్‌రెడ్డి మాట్లాడుతూ మనదేశం దశ దిశ మార్చిన మహనీయుడు బాబా సాహెబ్ అంబేడ్కర్ అని కొనియాడారు. ఆయన రచించిన రాజ్యాంగం ప్రపంచంలోనే గొప్పదిగా అన్ని దేశాలు కీర్తించాయన్నారు. నేడు ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీల అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారంటే నాడు ఆయన రచించిన రాజ్యాంగం ఫలితమేనన్నారు.

ఏపీలో రెడ్‌బుక్ రాజ్యాంగం

మన రాష్ట్రంలో ప్రస్తుతం భారత రాజ్యాంగం బదులు రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని ఎస్వీ విమర్శించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వైస్సార్‌సీపీ శ్రేణులు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై ఇష్టాను సారంగా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతున్నారన్నారు. ఈ దుర్మార్గం ఎన్ని రోజులు సాగదని, ప్రజలు తిరగబడతారని చెప్పారు. ఇప్పటికే ఎన్నికల హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుబాష్ చంద్రబోస్ మాట్లాడుతూ సామాజిక న్యాయాన్ని గుర్తించిన అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రాజ్యాంగంలో పొందుపరిచారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అంబేడ్కర్ ఆశయాలు, ఆలోచనలను తూచ తప్పకుండా పాటించారన్నారు. అన్ని వర్గాలకు సమన్యాయం చేశారన్నారు. విజయవాడలో రూ.400 కోట్లు వెచ్చించి అంబేడ్కర్ విగ్రహాన్ని నెలకొల్పారన్నారు. ఇప్పటి కూటమి ప్రభుత్వం పేదలకు మేలు చేయకపోగా వారిని అన్ని విధాలుగా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కిషన్, మహేశ్వర రెడ్డి, అనిల్ కుమార్, షరీఫ్, నాగవేణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లెలు ప్రగతికి సోపానాలు కావాలి

- పీఆర్అండ్ఆర్‌డీ తెలంగాణ రాష్ట్ర సలహాదారు జి. జయపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న జయపాల్‌రెడ్డి

కర్నూలు(అర్బన్): పల్లెలు దేశ ప్రగతికి సోపానాలు కావాలని, ఇందుకు క్షేత్ర స్థాయిలో ఉద్యోగుల సమన్వయ సహకారం ఎంతో అవసరమని పీఆర్అండ్ఆర్‌డీ తెలంగాణ రాష్ట్ర సలహాదారు, జెడ్పీ రిటైర్డు సీఈఓ జి జయపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని డీపీఆర్‌సీ భవనంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై బీఎల్‌టీఓలకు ఈనెల 5న శిక్షణ ప్రారంభమైంది. శుక్రవారం నాటి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైద్యం, విద్య, పరిశుభ్రత, వనరుల పెంపు, తాగునీరు, రోడ్లు, పరిశుభ్రత తదితర అంశాలపై సంబంధిత అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అప్పుడు ఆయా అంశాల్లో గ్రామాలు ముందుంటాయన్నారు. ప్రతి ఊరిని బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా తీర్చిదిద్దాలన్నారు. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం దిశగా గ్రామీణ ప్రాంతాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు అవసరమైన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. శిక్షణను క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శిక్షణ పరిశీలకులు వెంకటరత్నం, డీపీఆర్‌సీ కోఆర్డినేటర్ మంజులావాణి, ప్రోగ్రామ్ మేనేజర్ గిద్దేష్, డీఎల్ఎంటీలు సురేష్, వసంత, దస్తగిరిబాషా, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

- రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కల్లూరు: భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా అన్నారు. శుక్రవారం కల్లూరు మండలం పెద్దపాడు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 472 గ్రామాలు ఉన్నాయని అందులో 250 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందన్నారు. మిగిలిన గ్రామాల్లో కూడా త్వరలో రీసర్వే పనులు ప్రారంభిస్తామన్నారు. రెవెన్యూ సదస్సులు జనవరి 8వ తేదీ వరకు ప్రతి గ్రామంలో నిర్వహిస్తామన్నారు. రైతులు ఎలాంటి భూ సమస్యలున్నా దరఖాస్తులు అందజేసి పరిష్కరించుకోవాలన్నారు. పాస్‌బుక్, మ్యుటేషన్, సర్వే లాంటి ఏమున్నా సదస్సులో తెలియజేయాలన్నారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, దేవదాయ, సచివాలయం, వక్ఫ్‌కి సంబంధించిన అధికారులందరూ సదస్సుకు హాజరవుతారన్నారు. జాయింట్ కలెక్టర్ నవ్య మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసి రసీదు ఇస్తామన్నారు. వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఆధార్‌కార్డు, ఫోన్ నంబర్ ద్వారా దరఖాస్తు ఏ దశలో ఉందో తెలుసుకోవచ్చునన్నారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గంలో వక్ఫ్‌బోర్డు, దేవదాయ ఆస్తులు ఆక్రమణలకు గురయ్యాయని, వాటి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఆర్డీఓ సందీప్ కుమార్, పీజీఆర్ఎస్ నోడల్ ఆఫీసర్ దీప్తి, కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు, ఏపీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయం

కర్నూలు(సెంట్రల్): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నవ భారత నిర్మాణంలో బాబాసాహెబ్ కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసు ప్రతిష్ట పెంచాలి

- హోంగార్డ్స్ వ్యవస్థాపక దినోత్సవంలో ఎస్పీ పిలుపు

కర్నూలు: పోలీసు శాఖ ప్రతిష్ట పెంచేలా క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని హోంగార్డ్స్ సిబ్బందికి ఎస్పీ బిందు మాధవ్ పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో 62వ హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ ముందుగా సాయుధ హోంగార్డుల ప్లటూన్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులతో సమానంగా హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారని కొనియాడారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లా పోలీసు యంత్రాంగం తరపున హోంగార్డు సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. సదరన్ రీజియన్ హోంగార్డ్ కమాండెంట్ మహేష్ కుమార్ మాట్లాడుతూ హోంగార్డు వ్యవస్థ పోలీసు శాఖలో కీలకంగా మారిందన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేత...

10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్‌లలో మంచి మార్కులు సాధించిన ఆరుగురు హోంగార్డుల పిల్లలకు ఎస్పీ మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేశారు. అలాగే లాంగ్‌జంప్, షార్ట్‌పుట్, 100 మీటర్ల క్రీడాపోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వివిధ కేసుల్లో, బందోబస్తు విధుల్లో ప్రతిభ కనబరచిన 33 మంది హోంగార్డులకు ప్రశంసాపత్రాలు పంపిణీ చేశారు. ఆదోని యూనిట్‌కు చెందిన రాఘవులు, పత్తికొండ యూనిట్‌కు చెందిన కృష్ణ, కర్నూలు యూనిట్‌కు చెందిన హోంగార్డు విజయకుమారి పదవీ విరమణ పొందారు. వారిని శాలువ, పూలమాలలతో ఎస్పీ సన్మానించారు. విధుల్లో చైతన్యపరిచే పాటలు పాడి హోంగార్డు ఆర్.శ్యాముల్ అందరినీ అలరించారు. అనంతరం హోంగార్డు సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు ఎస్పీ భోజనం వడ్డించి సహపంక్తి భోజనం చేశారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ భాస్కర్‌రావు, హోంగార్డ్స్ డీఎస్పీ ప్రసాద్, పోలీసు వెల్ఫేర్ డాక్టర్ స్రవంతి, ఎస్‌బీ సీఐ కేశవరెడ్డి, ఆర్ఐలు జావెద్, నారాయణ, సోమశేఖర్, ఆర్ఎస్ఐలు, హోంగార్డు సిబ్బంది పాల్గొన్నారు.



హోంగార్డుల పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న ఎస్పీ

క్లుప్తంగా

నేత్ర దానం



నారాయణగుప్త(ఫైల్)

పత్తికొండ(తుగ్గలి): పట్టణానికి చెందిన రిటైర్డ్ తెలుగు పండిట్ సత్యనారాయణ గుప్త గురువారం కర్నూలులో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మృతి చెందారు. కొంత కాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన కోలుకోలేక మృతి చెందారు. తన కళ్లను డొనేట్ చేయాలని చాలా రోజుల క్రితమే గుప్త కుటుంబ సభ్యులకు సూచించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఎల్వీ కంటి ఆసుపత్రి నేత్ర నిధికి కళ్లను దానం చేశారు. ఆయన శిష్యులు, పట్టణ ప్రముఖులు, నాయకులు సత్యనారాయణగుప్త మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

వన్‌టౌన్ సీఐపై డీఎస్పీకి ఫిర్యాదు



డీఎస్పీకి ఫిర్యాదు అందజేస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్: స్థానిక వన్‌టౌన్ సీఐ శ్రీరాములుపై వ్యాపారవేత్త దిలీప్ శుక్రవారం రాత్రి డీఎస్పీ సోమన్నకు ఫిర్యాదు చేశారు. తమ సోదరి భర్త నితీష్ గత నెల 18 మృతి చెందాడని, అతడు పట్టణానికి చెందిన రోషన్ అనే వ్యక్తికి అప్పు ఉన్నాడంటూ సీఐ బెదిరిస్తున్నారని వ్యాపారవేత్త ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పు చెల్లించకపోతే అంతు చూస్తానంటూ గన్‌పెట్టి బెదిరించారని ఆయన డీఎస్పీకి ఫిర్యాదు చేశారు.

బొంతిరాళ్ల గ్రామ పరిసరాల్లో చిరుత సంచారం

- భయాందోళనలో ప్రజలు

డోన్ టౌన్: మండలంలోని వి.బొంతిరాళ్ల గ్రామ కొండలు, పరిసర వ్యవసాయ పొలాల్లో కొద్ది రోజులుగా చిరుత సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పదిహేను రోజుల క్రితం పొలంలో రైతుకు, వారం క్రితం మేకల కాపరికి కనిపించిన చిరుత.. బుధవారం రాత్రి గ్రామ సమీపంలోని వెంకటాపురం లక్ష్మీనారాయణ తోటలో ఉన్న కుక్క పిల్లను చంపినట్లు గ్రామస్తులు శుక్రవారం గుర్తించారు. సమాచారం తెలుసుకున్న ఫారెస్టు అధికారి ప్రవీణ్, బీట్ ఆఫీసర్ భారతి, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ వీర్ కుమార్ చిరుత సంచరించిన ప్రాంతాలకు వెళ్లి పాద ముద్రలు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ బొంతిరాళ్ల, చనుగొండ్ల గ్రామాల పరిసరాల్లో చిరుత సంచరిస్తున్నట్లు ఆధారాలు లభ్యమయ్యాయన్నారు. ప్రజలు, జీవాల కాపర్లు, వ్యవసాయ కూలీలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పొలాలకు వెళ్లిన వారు చీకటి పడేలోపే ఇళ్లకు చేరుకోవాలన్నారు. పంట పొలాల్లో పని చేసే సమయంలో ఒకరు పరిసరాలను గమనిస్తూ ఉండాలని, చిరుత కనిపిస్తే కేకలు వేయాలని సూచించారు. రాత్రి వేళల్లో పంట నూర్పిళ్ల వద్ద నిద్రించడం తగ్గించాలని, తప్పని పరిస్థితుల్లో అయితే మంటలు వేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు కుక్కలు, కోతులు, పశువులు, గొర్రెలు, మేకల మీద మాత్రమే దాడి చేశాయన్నారు. గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేస్తామన్నారు.

కాసులకు కక్కుర్తి!

- నిషేధిత జాబితాలోని భూములనూ రిజిస్ట్రేషన్ చేస్తున్న కల్లూరు సబ్‌రిజిస్ట్రార్
- తాజాగా 611/1, 124 సర్వే నంబర్లలోని భూములను రిజిస్ట్రేషన్ చేసిన వైనం
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న ఉన్నతాధికారులు

కల్లూరు సబ్‌రిజిస్ట్రార్ అధికారులు కాసులకు కక్కుర్తి పడుతున్నారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములు, ఇళ్లు, ప్లాట్లను సైతం రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. తాజాగా 611/1, 124 సర్వే నంబర్లలోని వక్ఫ్ భూములను సైతం కల్లూరు సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇదే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గతంలో పనిచేసిన ఓ సబ్‌రిజిస్ట్రార్ సైతం ఖాళీ స్థలాన్ని సరైన డాక్యుమెంట్లు లేకుండా రిజిస్ట్రేషన్ చేసిన బాగోతం కూడా బయటకు వచ్చింది.
– కర్నూలు(సెంట్రల్)



ఇటీవల రిజిస్ట్రేషన్ జరిగిన నిషేధిత జాబితాలోని భూమి ఈసీ



ఆస్తుల క్రయ, విక్రయాల కోసం కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చిన ప్రజలు

కల్లూరు పరిధిలోని సర్వే నంబర్లు 611/1, 124లలోని భూములు వక్ఫ్ ఆస్తులు. ఆయా ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయకూడదని ప్రభుత్వం నిషేధిత జాబితాలో ఉంచింది. అయితే కల్లూరు సబ్‌రిజిస్ట్రార్ మాత్రం అవేమీ పట్టించుకోకుండా రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నారు. కల్లూరులోని మహాలక్ష్మీనగర్ పరిధిలో ఉన్న సర్వే నంబర్ 611/1 లోని 86–294–జీ నంబర్‌తో ఉన్న 800 చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న ఇంటిని ఇటీవల కల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 15321/2024 నంబర్ మీద రిజిస్ట్రేషన్ చేశారు. అలాగే సర్వే నంబర్ 124లోని 122.225 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న భూమిని కల్లూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 14573/2024 నంబర్ మీద రిజిస్ట్రేషన్ చేశారు.

డాక్యుమెంట్లు లేకున్నా ఖాళీస్థలాన్ని సైతం..

కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని కల్లూరు 81వ వార్డు బాలాజీ నగర్‌లో నగర్‌లో 1951లో లేట్ అల్లంపల్లి చిన్న నాగప్ప 598, 542 సర్వే నంబర్లలో వేసిన వెంచర్‌లో 2.66 సెంట్ల ప్లాటును కొనుగోలు చేసినట్లు కర్నూలు ఆర్‌ఓ వారి ఆఫీసు ఒకటో పుస్తకంలో దస్తావేజు 1949/1951గా ఉంది. దీనికి దక్షిణ భాగంలో ఖాళీ స్థలం ఉండేది. అయితే ఆ ఖాళీ స్థలాన్ని 46ఏ గా చూపి అల్లంపల్లి చిన్న నాగప్ప కుమారులు ఏ.వీరన్న, ఏ.భాస్కర్, ఏ.నాగప్ప ఇటీవల కర్నూలుకు చెందిన దెబ్బ రామ్మోహన్ అనే వ్యక్తికి విక్రయించారు. ఇందుకు సంబంధించి కల్లూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజు నంబర్ 12724/2024 నమోదు చేశారు. అయితే ఈ ఆస్తి క్రయ, విక్రయంలో పలు లోపాలు ఉన్నాయి. ఈ స్థలానికి సంబంధించి వేసిన వెంచర్‌లో 46ఏ ప్లాటే లేదు. ఇక అల్లంపల్లి చిన్న నాగప్ప చనిపోయినట్లు మరణ ధ్రువీకరణ పత్రం లేదు. ఆయన కుటుంబ సభ్యుల వివరాలు తెలిపే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లను సమర్పించకుండానే రిజిస్ట్రేషన్ చేశారు. వారు సమర్పించిన ఈసీ కాపీ కూడా లోపభూయిష్టంగా ఉంది. అయినా రిజిస్ట్రేషన్ చేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకుగాను అప్పటి సబ్ రిజిస్ట్రార్‌కు భారీగా ముడుపులు ముట్టినట్లు తెలుస్తోంది.

చూసీచూడనట్లు..

రిజిస్ట్రేషన్స్ అండ్‌స్టాంప్ శాఖ ఉన్నతాధికారులు కల్లూరు సబ్‌రిజిస్ట్రార్ వ్యవహారంపై చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఆయన ఏమి చేసినా తమకేమీ సంబంధం లేదన్నట్లుగా ఉంటున్నారు. దీంతో ఇష్టారాజ్యంగా కాసులకు కక్కుర్తి పడి ప్రభుత్వం నిషేధంలో ఉంచిన భూములను సైతం రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. అయితే కల్లూరు సబ్ రిజిస్ట్రార్ వ్యవహారంపై తమకేమీ తెలియదని, ఆయన తన ఫోన్ కూడా ఎత్తడంలేదని జిల్లా రిజిస్ట్రార్ పేర్కొంటుండడం గమనార్హం.

అక్రమ రిజిస్ట్రేషన్ల వివరాలు సేకరిస్తున్నాం

611/1, 124 సర్వే నంబర్లలో వక్ఫ్ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. ఈ విషయం మా దృష్టికి వచ్చింది. ఎక్కడెక్కడ అక్రమంగా రిజిస్ట్రేషన్‌లు జరిగాయో వివరాలు సేకరిస్తున్నాం. సబ్ రిజిస్ట్రార్లు చూసుకోకుండా రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నారు. కోర్టుల పరిధిలో ఉన్నా రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయి. ఆక్రమణల వివరాలను కలెక్టర్‌కు నివేదిస్తాం.
–అల్తాఫ్, వక్ఫ్‌బోర్డు కర్నూలు డివిజన్, ఇన్‌స్పెక్టర్

విజేత వేల్పనూరు గార్ధబాల



ప్రథమ బహుమతి అందుకుంటున్న వేల్పనూరు గార్ధబాల యజమానులు

సంజామల: మండల పరిధిలోని ఆల్వకొండ క్రాస్ వద్ద కాశీరెడ్డి నాయన ఆశ్రమం మహోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నిర్వహించిన గార్ధబాల పోటీలలో వెలుగోడు మండలం వేల్పనూరు గ్రామానికి చెందిన సురేంద్ర గార్ధబాల విజేతగా నిలిచింది. ఆళ్లగడ్డ మండలం పెద్దకందుకూరు గ్రామానికి చెందిన గీతాంజలి గార్ధబాల రెండవ, మొట్టుపల్లె గ్రామానికి చెందిన కళ్యాన్ గార్ధబాల మూడవ, చాగలమర్రి మండలం పెద్దవంగళి గ్రామానికి చెందిన పెద్దపాములేటి గార్ధబాల నాలుగవ, బాచెపల్లి గ్రామానికి చెందిన నాగవైష్ణవి గార్ధబాల ఐదవ స్థానాలు దక్కించుకున్నాయి. గెలుపొందిన వృషభాల యజమానులకు నిర్వాహకులు వరుసగా రూ.20 వేలు, రూ.13 వేలు, రూ.7 వేలు, రూ.5 వేలు, రూ.వేల నగదు బహుమతులను అందజేశారు.

ఆకతాయికి జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఆకతాయికి శుక్రవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్షను ఖరారు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. టెక్కే ప్రాంతానికి చెందిన బల్రెంకల వెంకటేష్ గిరిన్నాథ్‌సెంటర్‌లో మహిళలకు సైగలు చేస్తూ ఈలలు, కేకలు వేస్తూ అసభ్యకర పదజాలంతో దూషిస్తుండటంతో స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని నిందితుడిని అరెస్ట్ చేసి జడ్జి ఎదుట హాజరు పరచగా పదిరోజులు జైలు శిక్ష ఖరారు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అదామా కంపెనీ సహకారం మరువలేనిది

- మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి

పాములపాడు: లింగాల ఎత్తిపోతల పథకం మరమ్మతులకు అదామా కంపెనీ సహకారం మరువలేనిదని మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని లింగాల ఎత్తిపోతల పథకం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను ఎంపీగా ఉన్నప్పుడు ఈ ప్రాంత రైతుల కోసం అదామా కంపెనీ రూ.40 లక్షలు ఆర్థిక సహకారంతో ఎత్తిపోతల పథకం మరమ్మతులు చేయించారన్నారు. దీంతో 1,800 హెక్టార్ల భూమికి సాగు నీరందుతుందన్నారు. అనంతరం రైతులకు పురుగు మందులు, పంటల గురించి కంపెనీ వారు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కంపెనీ లీడర్‌షిప్ హెడ్ సుధాకరాస్ జనార్దన్, హెడ్ ఆఫ్ సేల్స్ సౌత్ ఇండియా పాపునాయుడు, బీయూ ఆర్‌టీ జోన్ సతీష్‌కుమార్ లింగారెడ్డి, నిర్మాణ్ సీఓఓ అనురాధ, పథకం చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, వైస్‌చైర్మన్ రామలింగారెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం

- ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి



తీర్మానం ప్రతిని శివారెడ్డికి అందజేస్తున్న ఉమ్మడి జిల్లా నాయకులు

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి తెలిపారు. శుక్రవారం ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనను ఉమ్మడి కర్నూలు జిల్లా ఎన్‌జీఓ అసోసియేషన్ నేతలు కలిశారు. ఈ నెల చివరిలో ఖాళీ అవుతున్న అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పోస్టును ఏకగ్రీవంగా ఎన్నుకునే అంశంపై చర్చించారు. కృష్ణా జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌ను స్టేట్ జనరల్ సెక్రటరీగా ఎన్నుకునేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లా ఎన్‌జీఓ అసోసియేషన్ నాయకులు తీర్మానం చేసి, ప్రతిని రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి, కర్నూలు నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ కాశన్న, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడి మృతి



పార్లపల్లె రాజు (ఫైల్)

ప్యాపిలి: వెంగళాంపల్లి చెరువుకట్ట వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో బోయ పార్లపల్లె రాజు (20) మృతి చెందాడు. పెద్దపొదిళ్ల గ్రామానికి చెందిన రామాంజనేయులు, రంగమ్మల కుమారుడు రాజు తన మిత్రుడు కొప్పుల అరవింద్‌తో కలిసి ద్విచక్రవాహనంపై డోన్‌కు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ప్యాపిలికి వస్తుండగా వెంగళాంపల్లి చెరువుకట్ట వద్ద వారి ద్విచక్రవాహనం అదుపు తప్పి పడిపోయింది. ప్రమాదంలో రోడ్డుపై పడిన రాజు తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కొప్పుల అరవింద్‌కు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలోని ప్రధాన రహదారి పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టూటౌన్ సీఐ జి.చంద్రబాబు అక్కడికి చేరుకుని పరిశీలించారు. కొద్ది రోజుల నుంచి భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడని, అనారోగ్య కారణాలతో మృతి చెందాడని సీఐ తెలిపారు. పంచాయతీ అధికారులు ఎస్.రాఘవేంద్ర, నీలోఫర్ సమక్షంలో పంచనామా నిర్వహించారు. మృతుడి బంధువులు, తెలిసిన వారు ఉంటే 9121101194 ఫోన్ చేయాలన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం



మధు మృత దేహం

పాములపాడు: మండలంలోని కంబాలపల్లి గ్రామం వద్ద కేసీ కెనాల్‌లో గల్లంతైన యువకుడు కురువ మధు(22) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా మానపాడు గ్రామానికి చెందిన కురువ మధు ఈ నెల 4న కంబాలపల్లి గ్రామంలో బంధువు అంత్యక్రియలకు వచ్చాడు. అంత్యక్రియల అనంతరం స్నానం చేయడానికి కేసీ కెనాల్‌లో దిగి అదుపుతప్పి నీటిలో మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసీ కెనాల్ వెంట గాలింపు చర్యలు చేపట్టారు. బానకచెర్ల గ్రామ సమీపంలోని పవర్ హౌస్ వద్ద యువకుడి మృతదేహాన్ని గుర్తించారు. మృతుని తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్‌బాబు తెలిపారు. మృతదేహానికి ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలలో పంచనామా నిర్వహించి బంధువులకు అప్పగించారు.

సీఎంఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభం



సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఫరూక్, చైర్మన్ వెంకటరమణ, డైరెక్టర్ మోహన్‌బాలాజీ

నంద్యాల: జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను శుక్రవారం మైనార్టీ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్, సినీ హీరోయిన్ కృతిశెట్టి సీఎంఆర్ ఫౌండర్, చైర్మన్ మాపూరి వెంకటరమణ, మేనేజింగ్ డైరెక్టర్ మోహన్‌బాలాజీలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాలలో సీఎంఆర్ లాంటి పెద్ద మాల్స్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. షాపింగ్ మాల్‌ను ఏర్పాటు చేసిన వెంకటరమణను ఈ సందర్భంగా అభినందించారు. సీఎంఆర్ చైర్మన్ వెంకటరమణ మాట్లాడుతూ నాలుగు శతాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజలు సీఎంఆర్ షాపింగ్‌మాల్‌ను ఆదరిస్తున్నారన్నారు. సీఎంఆర్‌లో షాపింగ్ అంటే ప్రపంచ స్థాయి అనుభూతి కలిగేలా ఉంటుందన్నారు. ప్రజలకు కావాల్సిన, అన్ని రకాల వేడుకలకు నచ్చే విధంగా మోడరన్ వస్త్రాలు అతి తక్కువ ధరలకే అందిస్తున్నామన్నారు. తమ సొంత మగ్గాలపై నేయించిన వస్త్రాలను మార్కెట్లో మరెవరూ ఇవ్వని ధరలకు సీఎంఆర్ అందిస్తుందన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ మోహన్‌బాలాజీ మాట్లాడుతూ సీఎంఆర్ అంటే దివన్‌స్టాప్ షాప్ అన్నారు. అన్ని రకాల వెరైటీలు, డిజైన్లు లభిస్తాయన్నారు. నంద్యాలలో తమ 39వ షాపింగ్‌మాల్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. సినీ హీరోయిన్ కృతిశెట్టి మాట్లాడుతూ సీఎంఆర్ షాపింగ్‌మాల్‌లో అన్ని రకాల వస్త్రాలు నాణ్యతతో, తక్కువ ధరలో లభిస్తాయన్నారు.

న్యాయం కోసం వృద్ధురాలి పోరాటం

- కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ఆందోళన



కలెక్టరేట్ ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనలో పాల్గొన్న వృద్ధురాలు ఎల్లమ్మ

కర్నూలు(సెంట్రల్): తన భర్త చదువుల సుంకన్న నుంచి వారసత్వంగా రావాల్సిన భూమిని ఇప్పించి న్యాయం చేయాలని కోరుతూ 70 ఏళ్ల వృద్ధురాలు ఎల్లమ్మ శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమది కల్లూరు మండలం రేమడూరు గ్రామమని, తన భర్త కర్నూలు రూరల్ మండలం దిన్నెదేవరపాడులో 1948లో సర్వే నంబర్ 225లో 2.50ఎకరాల భూమిని కొనుగోలు చేశారన్నారు. కర్నూలు జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 783/1948 డాక్యుమెంట్లు కూడా ఉన్నాయన్నారు. అప్పట్లో తన భర్తకు పొలాన్ని అమ్మినవారి ప్రస్తుతం లేరని, వారి కుమారులు తమదని బెదిరిస్తున్నారని వాపోయారు. ఇదే విషయమై ఈనెల 2న పోలీసు స్పందనలో ఫిర్యాదు చేయగా కర్నూలు తాలూకా పోలీసు స్టేషన్‌కు వెళ్లాలని చెప్పారన్నారు. అక్కడికి వెళ్తే తమది డూప్లికేట్ డాక్యుమెంట్ అని, తమపైనే కేసు పెడతానని ఎస్‌ఐ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం జరగకపోతే ఆత్మహత్యే శరణ్యమన్నారు.

చౌక డిపోలపై విజిలెన్స్ 'నిఘా'

- కాటాలో మైనస్ మోడ్‌లో పెట్టి మోసాలు చేస్తున్నట్లు ఫిర్యాదు
- నగరంలో విస్తృతంగా తనిఖీలు
- బెంబేలెత్తుతున్న డీలర్లు

కర్నూలు: ప్రజా పంపిణీ ద్వారా తెల్ల రేషన్ కార్డుదారులకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని చౌకడిపో డీలర్లు, మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ ఆపరేటర్లు (ఎండీయూ) కుమ్మక్కై పక్కదారి పట్టిస్తున్నట్లు ఫిర్యాదుల నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు చౌక డిపోల్లో జరుగుతున్న మోసాలపై దృష్టి సారిస్తున్నారు. కర్నూలు అర్బన్ పరిధిలోని బాలాజీ నగర్‌లో ఉన్న 53వ నెంబర్ చౌక డిపోలో విస్తృత తనిఖీలు నిర్వహించి డీలర్ లక్ష్మీరెడ్డి, 66వ నెంబర్ ఎండీయూ ఆపరేటర్ నౌషద్‌పై కేసు నమోదు చేశారు. విజిలెన్స్ అధికారులు విశ్వనాథ్, మల్లేశ్వరమ్మ, కానిస్టేబుల్ భరత్ కుమార్‌తో పాటు ఏఎస్‌ఓ రామాంజినేయ రెడ్డి, ఎఫ్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తదితరులు బృందంగా ఏర్పడి బాలాజీ నగర్‌లోని 53వ చౌక డిపోను గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు రికార్డులతో పాటు సరుకు నిల్వలను తనిఖీ చేశారు. దాదాపు 91 క్వింటాళ్ల బియ్యం, 12 క్వింటాళ్ల జొన్నలు స్వాహా చేసినట్లు తనిఖీల్లో బయటపడింది. ఉండాల్సిన నిల్వ కంటే చౌక డిపోలో తక్కువగా ఉండటం, ఎలక్ట్రానిక్ కాటాలో క్లోజింగ్ బ్యాలెన్స్‌లో కూడా తేడాలు బయట పడటంతో డీలర్ లక్ష్మీరెడ్డి, ఎండీయూ ఆపరేటర్ నౌషద్‌పై కేసు నమోదు చేసి చౌక డిపోను సీజ్ చేశారు. వాహనాన్ని 24వ నెంబర్ చౌక డిపో డీలర్ విక్రమ్‌కు అప్పగించారు. సమీప కాలనీలోని మరో రెండు చౌక డిపోల్లో కూడా విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. చౌక డిపోల్లో జరుగుతున్న అక్రమాలపై విజిలెన్స్ అధికారులు నిఘా వేసినట్లు విస్తృతంగా ప్రచారం కావడంతో నగరంలోని పలువురు చౌక డిపో డీలర్లు శుక్రవారం తూతూమంత్రంగా పంపిణీ చేసి మమ అనిపించారు. కర్నూలు అర్బన్ ప్రాంతంలో మొత్తం 170 చౌక డిపోలు ఉన్నాయి. ప్రతినెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిత్యవసర సరుకులు చౌక డిపోల ద్వారా కార్డుదారులకు సరఫరా చేయాల్సి ఉంటుంది. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు చౌక డిపోల నుంచి సరుకులను ఎండీయూలకు ఎత్తుకుని వార్డుల్లోకి వెళ్లి కార్డుదారులకు సరఫరా చేయాలి. అయితే చౌక డిపో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు కుమ్మక్కై కార్డుదారులకు సరఫరా చేయాల్సిన బియ్యంతో పాటు ఇతర నిత్యవసర సరుకులను స్వాహా చేసి నల్లబజారుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు ఫిర్యాదుల నేపథ్యంలో విజిలెన్స్, రెవెన్యూ అధికారులతో పాటు మరోవైపు పౌర సరఫరాల శాఖ అధికారులు (సివిల్ సప్లయ్) కూడా ప్రజా పంపిణీపై నిఘా వేసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. అయితే తనిఖీకి వెళ్లే అధికారుల సమాచారం కూడా ముందుగానే డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు చేరుతుండటం చర్చనీయాంశంగా మారింది.

రోడ్ల విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

- ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి




కర్నూలులోని నంద్యాల చెక్‌పోస్ట్ వద్ద రోడ్డుపై పర్యటిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): రోడ్ల విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆర్‌అండ్‌బీ, జాతీయ రహదారులు, మునిసిపల్ అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల చెక్‌పోస్టు నుంచి గార్గేయపురం వరకు రహదారి మరీ ఇరుకుగా ఉండడంతో ప్రయాణం నిత్యం నరకంగా ఉంటోందని, దానిని 120 అడుగుల విస్తరణకు జాతీయ రహదారులు, కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ రహదారికి అవసరమైన భూమి, బాధితులకు పరిహారం చెల్లింపు విషయంలో జాతీయ రహదారులు 100 అడుగులకు సంబంధించి, కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్‌లు 20 అడుగులకు సంబంధించి చెల్లించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, అందుకు డీపీఆర్‌ను రూపొందించి ప్రభుత్వానికి పంపితే ఆమోదం పొందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ రహదారిలో నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే వేరే ప్రాంతానికి మార్పు చేయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నంద్యాల చెక్ పోస్టు నుంచి సఫా కాలేజీ వరకు ఉన్న 6 కిలోమీటర్ల రహదారిలో నూతనంగా 4 లేన్‌లు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కర్నూలు నుంచి బళ్లారి వరకు వెళ్లే రహదారికి నేషనల్ హైవే కన్వర్షన్ పనులు పురోగతిలో ఉన్నాయని, చిన్నటేకూరు బైపాస్ రోడ్డును పంచాయతీరాజ్ రోడ్డు నుంచి ఆర్‌అండ్‌బీకి మార్పు చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు. కాగా, న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు పనుల కింద మంజూరు చేసిన రోడ్డు పనులు ఇంకా మంజూరు కాలేదని, 10 రోజుల్లో పనులను మొదలుపెట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చే పనులను డిసెంబర్‌లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అంతకుముందు నంద్యాల చెక్ పోస్టు ఏరియాలో రోడ్డు విస్తరణ చేయాల్సిన ప్రాంతాన్ని మంత్రి ఎమ్మెల్యేలు గౌరు చరితారడ్డి, బొగ్గుల దస్తగిరి, జేసీ డాక్టర్ బి.నవ్యతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో కలెక్టర్.రంజిత్‌బాషా,అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ మహేశ్వరరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిరంజీవి, కర్నూలు ఆర్‌డీఓ సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

సాంకేతిక ఉత్పాదకత పెరగాలి

- రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): పేదలకు ఉపాధి కల్పించే దిశ లో సాంకేతిక ఉత్పాదకత పెరగాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ అన్నారు. శుక్రవారం స్థానిక ఈఎస్‌ఐ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రాంతీయ పాలిటెక్ ఫెస్ట్–2024 వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాజకుమారితో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయడానికి ఈటెక్ ఫెస్ట్ దోహదపడుతుందన్నారు. ఈటెక్ ఫెస్ట్‌లో 12 పాలిటెక్నిక్ కాలేజీల నుంచి 96 ప్రాజెక్టులపై 324 మంది విద్యార్థులు ప్రదర్శించిన ఆవిష్కరణలు విద్యార్థులు చర్చించుకోవడానికి చక్కటి వేదిక అయిందన్నారు. పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణాలకు, ఇతర మౌలిక వసతులకు బడ్జెట్‌లో నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ సమాజంలో ఉన్న వ్యక్తుల జీవన ప్రమాణాలు పెంపొందించే దిశలో సాంకేతిక ప్రాజెక్టుల ఆవిష్కరణలు ఉండాలన్నారు. ఎంచుకున్న రంగంపై దృఢ సంకల్పం ఉంటే ఏదైనా సాధ్యపడుతుందని విద్యార్థులకు సూచించారు. ఎస్‌బీయూ రీజినల్ జాయింట్ డైరెక్టర్ నిర్మల్ కుమార్ ప్రియా మాట్లాడుతూ ఈ టెక్ ఫెస్ట్ ద్వారా విద్యార్థులు పుస్తక జ్ఞానాన్ని నిజజీవితంలో ఎలా వినియోగించుకోవాలో తెలియజేస్తుందన్నారు. విద్యార్థులు సృజనాత్మకతకు పదును పెడితే నూతన ఆవిష్కరణ ద్వారా అనేక సమస్యలకు పరిష్కారాలను కనుగొనవచ్చన్నారు. అంతకుముందు విద్యార్థులు ప్రదర్శనలను మంత్రి, కలెక్టర్ తిలకించారు. సమావేశంలో పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ శ్రీనివాస ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

చిప్పగిరి: అనారోగ్య సమస్యల కారణంగా ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రం చిప్పగిరిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన కుమ్మరి శంకరయ్య (65) బీసీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. కొంత కాలంగా మూత్ర సంబంధిత సమస్యతో తీవ్రంగా బాధ పడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం గ్రామ సచివాలయం వెనుక ఉన్న బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య సుమంగళమ్మ ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.